# ఈ చెట్టు తప్పు

గడిచిన పదిహేను నిమిషాల్లో తొమ్మిదోసారి లాయరుగారు తెల్ల రుమాలుతో కళ్లజోడు తుడుచుకొని ముక్కు మీద పెట్టు కొని, ఆయనవేపు చూసి మళ్లీ చేతిలోకి తీసుకొని అన్నాడు.

"పట్టాభిగారూ, చాలాదూరం వెడుతున్నారు. అక్కడ మీకు ఏం తోస్తుందో... పరాయి భాష కూడాను."

"ఏవీ తోచదు. నాకు వెళ్లడం సుతరామూ ఇష్టం లేదు. అబ్బాయి ఒప్పుకోవడం లేదు."

అర్థమైనట్లు లాయరుగారు తలూపేరు. పట్టాభిగారూ నిశ్శబ్దంగా కుర్చీలో కూచుని ఉన్నారు. దరిదాపు గంట నుంచీ అలాగే కూచున్నారాయన. గంటకొడితే శబ్దం వచ్చినట్లు ఆయన నిమిత్తంలేకుండా అడిగినదానికి సమాధానం వస్తోంది. ఇల్లు అమ్మడం, ఊరొదిలి వెళ్లిపోవడం, ఇష్టంలేక మనసులోనే తలకిందులవుతున్నాడు అనుకున్నారు లాయరుగారు. తెల్లటి చొక్కా, మెడ చుట్టూ కండువా, కనుబొమల మధ్యచిన్న కుంకుమ బొట్టుతో పట్టాభిగారు లాయరు తలమీంచి వెనకగోడ మీద వేలాడుతున్న సీతారామ కల్యాణంపటం వైపు చూస్తున్నారు. రామచంద్రమూర్తి మంగళసూత్రం కట్టే వరకూ ఓపిగ్గా కూచున్నట్టుగా ఉన్నారాయన. తన ముందున్న స్టాంపు కాయితాల్ని పదమూడోసారి మళ్లీ తిరగేశారు లాయరుగారు. ఇద్దరికీ ఏభై దాటేయి. పేరి శ్రీరామ్మూర్తిగారికి, పట్టాభిగారితో స్నేహం కాకపోయినా చాలా కాలం నుంచీ పరిచయం. ఆ ప్రాంతంలో మొదటగా వచ్చి ఇళ్లు కట్టుకన్న కుటుంబాలవారు. ఇప్పుడాయన వెళ్లిపోతున్నాడంటే ఆయనకీ ఏదోగానే ఉంది. వారిద్దరికీ మూడు వీధుల మధ్య దూరం. రెండో వీధిలో అనిబిసెంటు వచ్చినప్పుడు మొక్కనాటిన పార్కు ఉంది. సాయంకాలాలు తరచుగా అక్కడే కలుస్తూంటారిద్దరూ. పార్కు అవతలగా లావుపాటి కన్నడ బ్రాహ్మణ హొటల్లో కూడా ఎప్పుడేనా ఊతప్పం నిమిత్తం

కలుస్తుంటారు. పార్కు వెనకవీధిలో శ్రీరామ్మూర్తిగారు, పార్కు నానుకున్న మెయిన్‌రోడ్డు పక్క వీధిలో ఓ చివర పట్టాభిగారి కాపురం. చీకటి పడిపోయింది. శ్రీరామ్మూర్తిగారి కచేరీ గదిలో ఇందాకనే దీపం వెలిగించాడు గుమాస్తా. చేతుల్లేని ఖద్దరు బనీను, నుదుటిమీద పెద్దబొట్టు, మధ్యాహ్నం తాంబూలం తాలూకు ఎరుపు మిగిలి పోయిన పెద్ద నోరూ, పేరివారికి పెద్ద ప్లీడరని పేరు. కాయితాల మీంచి పట్టాభిగారి వేపు చూశారాయన. ఆయన రామచంద్రమూర్తి మంగళసూత్రధారణ గురించి వేచి ఉన్నారు.

"ఇందాకనే వస్తానన్నాడండీ. ఇతగాడు ఆలస్యం చేసే మనిషి కాదు" అన్నారాయన.

"ఏదో పనిబడి ఉంటుంది" అంటూండగానే గుమాస్తా వచ్చి "ఒచ్చేసేరండి" అని వెళ్లిపోయాడు. శ్రీరామ్మూర్తిగారొక్కరే గుమ్మం వేపు చూశారు.

"దయచెయ్యండి. అలా కూచోండి వారూ, నేనూ మీ కోసం చూస్తున్నాం."

"నన్ను క్షమించాలి. బాబుగారూ తప్పక ఆలీసం చేసేను. పెద్దలు నాకోసం చూస్తూ కూచున్నారు. మరి ఏవీ అనుకోకండి".

"ఫరవాలేదులెండి" అన్నారు పట్టాభిగారు.

"మంచితీర్థం పుచ్చుకుంటారా?"

"అబ్బే ఒద్దండి. అయ్!"

"సరే. నేను చెప్పవలసింది ఏవీ లేదు. కాయితాలు మీరిరువురూ చూసినవేను. ఇక్కడ ఇద్దరూ సంతకాలు పెట్టండి. తారీఖు వెయ్యండి. అంతే పని అయిపోయినట్టే."

శ్రీరామ్మూర్తిగారు కాయితాలు ముందుగా పట్టాభిగారి ముందు పెట్టారు. సంతకంచేసి ఆయన కిచ్చేరు పట్టాభిగారు. "పంతం చిన్నరావు వ్రాలు. తేదీ 12.4.1952" సంతగించిన కాయితాలు జాగ్రత్తగా ప్లీడరు గారికిచ్చేరు చిన్నారావుగారు. బక్కపలచగా చామనచాయలో కనుబొమల మధ్య నుంచి ఎర్రటి నామంతో చిన్నారావు చాలా సౌమ్యమైన మనిషి. "వ్యవసాయం పెద్దోడి చేతిలో పెట్టి ఏదో ఓపికుందిగదాని వ్యాపారంలోకి దిగేనండి."

శుభం అన్నారు ప్లీడరు గారు.

"మీ పెద్దలిద్దరూ దీవించాలండి మరి" అన్నారు చిన్నారావుగారు.

"ఆ శ్రీరామచంద్రమూర్తి మిమ్మల్ని తప్పకుండా అనుగ్రహిస్తాడు. మీ వ్యాపారం దిగ్విజయంగా నడుస్తుంది. నా సలహా అవసరం అనుకుంటే ఎప్పుడేనా రావొచ్చును."

పట్టాభిగారు కూడా మంచిదన్నారు. మరో రెండునిమిషాలు పిచ్చాపాటీ మాట్లాడుకున్న తరువాత చిన్నారావుగారు అన్నారు. "మరి నాకు సెలవైతే వెళ్లొస్తానండి. అయ్!" పట్టాభిగారి వేపు కూడా చూశాడాయన. ఒక్క క్షణం ఆగి సూటిగా

చిన్నారావుగారి వేపు చూస్తూ అన్నారాయన.

"చిన్నారావుగారూ మీరు నాకో మాట ఇవ్వాలి. ప్రమాణం చేసి నా మాట నిలబెట్టగలరా?" ఇద్దరూ ఆశ్చర్యపోయారు. ఆయనే అన్నారు మళ్లీ. "ఇదేం డబ్బు లావాదేవీలకు సంబంధించింది కాదు లెండి."

"చెప్పండాయ్!"

"ఏవీ లేదు. మన స్థలంలో గేటుగోడ చివర పెద్ద చెట్టు ఉంది చూశారా?"

"అయ్. చూడకేవండి. పెద్ద చెట్టు గదండి."

"అవును. మా నాన్నగారు వేశారు. నాకో మాట ఇవ్వాలి. స్థలంతోపాటు చెట్టు మీదయిపోయింది. కానీ ఆ చెట్టు ఎంత అవసరం వచ్చినా ఎట్టిపరిస్థితుల్లోనూ కొట్టనని మాట ఇవ్వగలరా?"

లాయరుగారూ, కాపుగారూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. పట్టాభిగారు నిశ్చలంగా చిన్నారావుగారివేపు చూస్తున్నారు. మనసులోంచి అన్నాడు చిన్నారావుగారు.

"బాబుగారూ. నా కంఠంలో ప్రేణం ఉండగా, ఆ చెట్టు మీద చెయ్యెయ్యనని ప్రెమాణం చేస్తున్నాను."

"మంచిది. చాలు. "

కానీ, మిగతా ఇద్దరికీ తేరుకోడానికి కొన్ని క్షణాలు పట్టింది. ఇద్దరికీ నమస్కారాలు పెట్టి వెళ్లిపోయారు చిన్నారావుగారు. మరో రెండు నిమిషాలాగి పట్టాభిగారు కూడా బయటికి వచ్చేరు.

"ఉండండి అలా ఓసారి పార్కుకి వెడదాం" అన్నారు లాయరుగారు. "కాదు రేపు కలుద్దాం" అంటూ వచ్చేశారు పట్టాభిగారు. హోటలు ముందు నుంచి లావుపాటి కన్నడిగుడు పట్టాభిగార్ని చూశాడు. పలకరిస్తారేమోనని చూశాడుగానీ, పట్టాభిగారు ఆయన కాళ్లననుసరించి తిన్నగా వెళ్లిపోయారు. పట్టాభిగారింటి గుమ్మానికి అటూ ఇటూ అరుగులు ఇంకా ఇంటిదగ్గరికి రాకుండానే ఆయన చెవులకి తెలిసిపోయింది. తలుపు నెట్టుకొని లోపలికి వెళ్లి వరండా మెట్లెక్కుతుండగా ఆమె వచ్చింది. "ఉండండి కాళ్లు కడు క్కుందురుగాని". పంచె కొంచెం ఎత్తి పట్టుకొన చెట్టువేపు చూశారాయన. ఉత్సాహమో, అందోళనో, ఆకలో తెలీదుగానీ చెట్టునిండా పక్షులు నానా గొడవా చేస్తున్నాయి. ఆయనకి ప్రాణం లేచి వచ్చినట్టయింది. అనేక గొంతుకలతో చెట్టే గొడవ చేస్తున్నట్లుంది.

"వెళ్లిన పని అయినట్టేనా? ఇంకా పెందరాళే వస్తారనుకున్నాను" అంటూ ఖాళీ చెంబు తీసుకుందామె. ఆయన మాట్లాడకుండా వరండాలో కొయ్యకుర్చీలో కూచుని కండువా తీసి ఆమెకందించారు. "చార్లో పోపెట్టి వస్తాను". పట్టాభిగారు చారు మాట

వినలేదు. ఆయన ఒళ్లంతా పక్షుల కూతలలో పాటమరించి పోయినట్టయింది. ఉదయం, సాయంత్రం, ఆయనకా సంగీతం వినందే తోచదు. పట్టాభిగారికాసాయంత్రం ఒంటరితనంలో చెట్టంత బెంగ. పెద్దాడు నాగపూర్ రాక తప్పదని చెప్పినప్పట్నించీ చెట్టు మీద ఈ బెంగ పెరిగిపోయింది. బయటి చెట్టు ఆయన జీవితంలా పెరిగింది. కొమ్మలేసుకుంటూ, ఆకులు రాల్చుకుంటూ, చిగురిస్తూ జనన మరణాలలాగా. నాన్నగారు వేసిన మొక్క కొమ్మలు బలపడి పచ్చగా విస్తారంగా పెరిగింది. ఆ మధ్య ఎప్పుడో చెట్టు చుట్టూరా ఇటు కలు పేర్పించి మట్టిపోయించారాయన. ("గూడ్సు బండీలో తెస్తారా ఏవిటి?") పట్టాభిగారికో కాకుల లెక్కలాంటిది ఉంది. ఎన్ని పిల్ల పక్షులున్నాయి. పెద్దవెన్ని? గూళ్లు జాగ్రత్తగా చూసుకుంటారాయన. వరండాచివర ధాన్యంకంకులు వేలాడదీశారాయన. చూరు కింద పిచుక గూళ్లు లెక్క పట్టాభిగారికి. 'ఇహ ఇదంతా నాది కాదు' అన్నం సయించింది కాదు. రాత్రి తెల్లవారుజామునెప్పుడో కలత నిద్రలో కలొచ్చిందాయనకి ఏదో సముద్రం ఒడ్డున ఓ మహావృక్షం కింద కూచుని ఉన్నారు. చెట్టు నిండా పక్షులు ఆయన భుజం మీదా, నెత్తి మీదా. ఒళ్లో చిన్న రంగు రంగుల పిట్టలు. ఇంతలో సముద్రం మీంచి ఓ నీలం రంగు పిట్ట వచ్చి సరాసరి ఆయన చేతి మీద వాలింది. రెక్కలు మరోసారి దులుపుకొని అంది. "మీ ఇల్లు, చెట్టూ పడగొట్టేశారు". పట్టాభిగారికి ఏడుపొచ్చింది. ఉదయం కళ్లు నులుముకుంటూ చూస్తే దిండు తడిసి ఉంది.

రాత్రి తొమ్మిదయింది. చౌదరిగారు మరో గుక్క విస్కీ తీసుకుని దస్తావేజు కాయితాలు చూస్తున్నారు. పట్టాభిగారి దస్తావేజు చిరిగి పేలికలయిపోవడానికి సిద్ధంగా ఉంది. 1952 నుంచి అయిదుగురు యజమానులు మారేరు. కానీ చిన్నారావు క్రయపత్రంలో చివరి వాక్యం చౌదరిగారికి వింతగా అనిపించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆవరణలో ఉన్న చెట్టు కొట్టడానికి వీల్లేదు! కాయితాలు చూస్తూ సిగరెట్టు వెలిగించాడాయన. చిన్నారావుగారనే ఆయన తన బావమరిది కొడుక్కే స్థలం అమ్మేశాడు. ఆయన అమ్మేనాటికే శ్రీరామ్మూర్తిగారు పోయి ఆయన కొడుకు ప్లీడరీ చేస్తున్నాడు. పార్కు పక్కన లావుపాటి కన్నడిగుడి హెూటల్ని ఒక రెడ్డిగారు కొన్నారు. తరువాత ముప్పై సంవత్సరాలలో పార్కు చుట్టూ పెంకుటిళ్లు లేకుండా పోయాయి. బట్టలకొట్టువాళ్లు, పెద్ద దుకాణాలవారూ, కాంట్రాక్టర్లూ, కోచింగ్ సెంటర్లూ, బేంకులూ, ఆస్పత్రులూ వీటన్నింటి మధ్యా పార్కు చిన్న పచ్చటి చేతిరుమాలులా పడి ఉంది. పట్టాభిగారి పెద్ద స్థలం చుట్టూ పాత ఇళ్లు లేవు. సాయంకాలం ఆరుదాటితే పట్టాభిగారి పక్షులు గొడవ తప్ప మరో శబ్దం వినబడేది కాదు. పల్చటి ధూళి, కారు హారన్ల అపశృతులు, రకరకాల దుర్గంధాలు పెద్ద చెట్టును కమ్ముకుంటూన్నాయి. అనేక భవనాలు మెరు స్తోన్న గాజు కిటికీలతో శత్రువుల్లా పట్టాభిగారి స్థలాన్ని చుట్టుముట్టాయి. "రాజు వెజ్-నాన్‌వెజ్ మీల్సు హెూటల్" యజమాని రాజు గారు

మెస్సుకోసం అద్దెకు తీసుకుని తరువాత కొనుక్కున్నారు. చెట్టు తప్ప. రాజుగారు హఠాత్తుగా పోయిం తరువాత చాలాకాలం ఖాళీగా ఉండిపోయింది. ఆ తరువాత ఎవరో కొనుక్కుని మొత్తానికి సూర్దారపు రమాదేవిగారికి అమ్మేశారు. చెట్టు తప్ప. మరీ చెట్టంత కాకపోయినా చెయ్యెత్తు మనిషావిడ. ఇల్లు మార్పులు చేయించి "సాయిబాబా ఉద్యోగినుల, విద్యార్థినుల వసతి గృహము' నడిపి, చాలా లావయి అదే పరిమాణంలో బంగారం, బేంకులో డబ్బూ జమైన తరువాత వ్యక్తిగత కారణాలవల్ల మొదట్నించీ అణు కువగానే ఉంటున్న భర్తని ఒదిలేసి హైదరాబాదు మకాం మార్చింది.

తన చేతిలోకి వచ్చి వారం అయింది. మారుతున్న నగరంలో వెక్కిరిస్తున్నట్టుగా ఇదొకటే మిగిలిపోయింది అన్నాడాయన. ఆధునికంగా నాలుగంతస్తుల అపార్ట్‌మెంటు భవనం కట్టాలని చౌదరిగారి సంకల్పం. పేరి శ్రీరామ్మూర్తిగారి తరువాత చాలామంది లాయర్లు, ముఖ్యంగా క్రిమినల్ లాయర్లు ఆ ప్రాంతంలో వచ్చి చేరేరు. డాక్టర్లతోపాటు వారి కోసం 'రక్తము, మలము, మూత్రము, కళ్లె పరీక్ష చెయ్యబడునని' స్థలం చూడగానే అనిపించింది చౌదరిగారికి. చెట్టున్నచోట మంచి షాపు కట్టొచ్చు. ప్లాను ఆమోదించబడింది. గ్లాసు మళ్లీ నింపుకొని ఎర్రటి రొయ్య ముక్కని నోట్లో వేసుకుని, మళ్లీ కాయితాలు చూశారు చౌదరిగారు. నిజానికి అనుమానం నిన్ననే వచ్చింది. సిద్ధాంతిగారికి ఫోన్ చేసి, దగ్గరుండి మరీ తీసుకెళ్లేరాయన. "ఏవీ లేదండయ్యా. ఏ క్షుద్ర పూజలకీ, దెయ్యాలకీ, దేవతలకీ సంబంధించి కాదు. మీరు నిక్షేపంలా కొట్టెయ్యచ్చు. మీకేవీ కీడు జరగదు. నేనొక్కణ్ణి ఉన్నాను గదా."

"మరి ఎవరూ చెట్టు అమ్మడానికి ఈల్లేదని రాసుకున్నారు?"

"ఛాదస్తం చతుర్మధ్యం."

ఒకటి మాత్రం నిజం. ఆ ఇంట్లో అందరూ సుఖపడి సంపన్నులైనవారే. మళ్లీ అందరి షేర్లూ గుర్తుచేసుకున్నారు చౌదరిగారు. పడుకోబోయేముందు 'చౌదరి మేన్షన్' రంగుల భవనాన్ని కంట్లో వేసుకుని నిద్రపోయారాయన. ఉదయమే సిద్ధాంతిగారు ఫోన్ చేశారు. "అయ్యా! జ్ఞాపకం ఉందా? రేపుదయం 9.22కి ముహూర్తం. సరిగ్గా ఆ టైముకి చెట్టు మీద మొదటి వేటు పడాలి."

సాయంకాలం కమీషనరుగార్ని కలిసి చీకటి పడుతుండగా ఇంటివేపు బయల్దేరేరు చౌదరిగారు. లైట్లు వెలిగేయి. దార్లో ఆగి బయల్దేరి పట్టాభిగారి వీధి దాటిపోయాడాయన. చటుక్కున ఎడంవైపు తిప్పి మళ్లీ వెనక్కి రోడ్డు మీదకి ఒచ్చి కొత్త ఇంటి సందులోకి మళ్లేరాయన. గుమ్మం ముందు కారాపి టార్చి తీసుకుని లోపలికి వెళ్లేరు చౌదరిగారు. చెట్టు మీద పిట్టలు అప్పటికే స్వరమేళ మొదలుపెట్టేయి. చుట్టూరా చూశారాయన. అంతా చీకటిగా ఉంది. మళ్లీ చెట్టువేపు చూసి వెనక్కి

తిరగబోయి, ఆగి చెట్టు మీదికి టార్చి లైటు వేశారాయన. చెట్టు లోపలికి వెలుగు చెయ్యి తిరుగుతోంది. చటుక్కున పక్షులు శబ్దాలు ఆగిపోయాయి.

కళ్లజోడు తీసి పెట్టుకొని, మళ్లీ లైటువేశాడాయన. తను సరిగ్గానే చూశాడు. లైటు కదిపి చూశాడు. అదుగో. ఆయన గుండె ఒక్కసారి మోగి ఆగిపోయింది. కళ్లు పెద్దవి చేసి చూశాడాయన. ఆయన గుండె మద్దెల స్పష్టంగా ఆయనకే వినబడుతోంది. చెట్ల కొమ్మల్లోంచి టార్చి వెలుగులో మెల్లిగా సునాయాసంగా జారుతూ ఒక మనిషి దిగుతున్నాడు. చౌదరిగారి చెయ్యి ఆకులా ఒణికిపోతోంది. నోరు తడారిపోయింది. నాలిక చెక్కముక్కలా ఉంది. కళ్ళు తిరిగి కింద పడ్డానికి సిద్ధంగా ఉన్నాడు.

పెద్ద గుబురులా వెండి జుట్టూ, తెల్లని ధోవతీ, నుదుటి మీద కుంకుమ బొట్టూ, తెల్లని చర్మంనంచీలో ఉన్నట్లున్నాడాయన. చౌదరిగారి వేపు నిశ్చలంగా చూస్తున్నాడతను. చౌదరి కాళ్లకి మాత్రమే మలేరియా తగిలినట్టు ఒణికి పోతున్నాయి. ఆ వ్యక్తి కళ్లు మెరిసిపోతున్నాయి. అట్లాగే చౌదరిగారి వేపు సూటిగా చూస్తూ అన్నాడతను.

“నన్ను నిడదవోలు వెంకట పట్టాభి రామారావంటారు. దయచేసి మీరీ చెట్టు కొట్టకండి. గూళ్లు పోయి ఈ పక్షులన్నీ చెల్లాచెదురైపోతాయి. చెట్టు కొట్టనని మాట ఇవ్వగలరా?”